## నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడాలని కొత్త విద్యుత్ పాలసీ తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబోతున్నట్టు పేర్కొన్నారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. వేసవిలో విద్యుత్ ప్రణాళికపై ఎస్పీడీసీఎల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించామని, పూర్తి సన్నద్ధతతో ఉన్నామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. రైతులు, పారిశ్రామికవేత్తలు విద్యుత్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యాదాద్రిని గత ప్రభుత్వం వదిలేయడం వల్ల భారం పెరిగిపోయిందని, పర్యావరణ అనుమతులు వేగంగా తీసుకొచ్చి యాదాద్రి యూనిట్ 2 ప్రారంభించుకున్నామన్నారు. వేసవిలో విద్యుత్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

## మహాకుంభమేళాలో 10 కోట్లకు పైగా
# భక్తుల పుణ్యస్నానాలు



(మొదటి పేజీ తరువాయి)

10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పుణ్యస్నానాలపై ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపింది. ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని వెల్లడించింది. గురువారం మధ్యాహ్నం వరకు 30 లక్షల మంది పుణ్యస్నానాలు చేసినట్లు తెలిపింది.

మకర సంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకలో పాల్గొన్నారు. దీంతో పండుగల వేళలో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై పరిమితులు విధించింది. మిగిలిన రోజుల్లో ఎలాంటి ఆంక్షలు అమలులో ఉండవు. అయితే.. ఈ సారి కుంభమేళాకు 45 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు 10 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ కార్యక్రమం 12 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు సృష్టించింది. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడిక్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

## అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి
# సంక్షేమ ఫలాలు

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**

**విశ్వంభర, వనపర్తి:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా గురువారం ఉదయం ఘనపూర్ మండలంలోని సల్కలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిజమైన లబ్దిదారులకే అందాలని, ఇంకా ఎవరైనా మిగిలిపోయిన, పేర్లు జాబితాలో లేకున్నా నమోదు చేసుకొనేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలి, సంక్షేమ పథకాలను అందించాలి అనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వద్ద ఉన్న దరఖాస్తులను ప్రజల ముందు చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సభలో చదువుతున్న పేర్లలో ఎవరైనా అనర్హులు ఉంటే సభలోనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అనర్హుల పేర్లు తొలగించి మిగిలిపోయిన అర్హుల పేర్లను తిరిగి లబ్ధిదారుల జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. ఒకవేళ జాబితాలో పేర్లు లేకుంటే ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు లేకుంటే మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ప్రాంతం నుండి ఒకప్పుడు వలసలు వెల్లేవారని, మహాత్మ గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పుడు సస్యశ్యామలంగా మారిందని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేవలం వనపర్తి జిల్లాకే రూ.175 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అనవసరంగా ఖర్చులు చేసి అప్పుల పాలు కావద్దని, పౌష్టికాహారం, తగిన వ్యాయామం చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండొచ్చన్నారు. పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో కాకుండా నాణ్యమైన బోధనలు అందించే ప్రభుత్వ పాఠశాలల్లో నే చదివించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## కిడ్నీ రాకెట్ కేసులో దర్యాప్తు ముమ్మరం

**విశ్వంభర, హైదరాబాద్:** సరూర్‌నగర్ పరిధిలోని అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఎనిమిది మంది దళారులను పోలీసులు గుర్తించారు. గత ఆరు నెలలుగా అలకనంద ఆస్పత్రిలో ఈ తతంగం నడుస్తున్నట్లు గుర్తించారు. బెంగళూరుకు చెందిన వైద్యుడు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వైద్యుడితోపాటు మరికొంత మంది ప్రమేయం ఉందేమోనన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆస్పత్రి నిర్వాహకుడు సుమంత్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

## వేంకటేశ్వరస్వామి హుండీలో భారీగా రూ.2వేల నోట్లు

**విశ్వంభర, తెనాలి:** గుంటూరు జిల్లా తెనాలి సమీపంలో వైకుంఠపురంలో రద్దయిన రూ.2వేల నోట్లు ప్రత్యక్షం కావడం చర్చనీయాంశమైంది. ప్రముఖ అధ్యాత్మిక క్షేత్రమైన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు సందర్భంగా భారీగా రూ.2వేల నోట్లు బయటపడ్డాయి. ఆలయ అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తుల సమక్షంలో గురువారం స్వామివారి హుండీ కానుకలు లెక్కించారు. ఈ క్రమంలో రూ.2 వేల నోట్లు 122 (రూ.2.44లక్షలు) ప్రత్యక్షమయ్యాయి. 2023లో రద్దయిన రూ.2వేల నోట్లు హుండీలో ప్రత్యక్షమవడంతో దేవస్థానం సిబ్బంది కంగుతిన్నారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందే..





**విశ్వంభర, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.

ఈ మేరకు గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 202425 బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

**డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన..**

"కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి... ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది." అని తెలిపారు.

**బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన..?**

కులగణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుందని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎండగట్టారు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని, డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. "బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది..?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన..**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది పూర్తయ్యిందని, మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగిసిందని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోందని వివరించారు. కానీ మీ ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న సోయిలేనట్లు అర్థమవుతోందని అనుమానం వ్యక్తం చేశారు.

**రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందే..**

బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. కుంటిసాకులు చెప్పి ఇచ్చిన మాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం మిమ్మల్ని సహించబోదని, బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మీ మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటామని హెచ్చరించారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు.

# సెల్‌ఫోన్‌లో గురుమూర్తి గుట్టు

**విశ్వంభర, హైదరాబాద్:** మీర్‌పేట సంచలన హత్య కేసులో విస్తుపోయే విషయాలు బయటికొస్తున్నాయి. మరో మహిళతో అక్రమ సంబంధంతోనే భార్యను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. గురుమూర్తి తన భార్యను చంపి.. మృతదేహాన్ని ముక్కలు చేసి ఉడికించి.. ఎముకలను రోట్లో వేసి దంచి పొడిగా చేసిన ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది.

దర్యాప్తులో భాగంగా నిందితుడు గురుమూర్తి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులు పరిశీలించారు. అందులో ఓ మహిళకు సంబంధించిన ఫొటోలను గుర్తించారు. ఆ మహిళతో సంబంధం కారణంగానే భార్యను అడ్డు తొలగించుకునేందుకు.. కడతేర్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు చెప్పిన వివరాలను బట్టి సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఈనెల 15న గురుమూర్తి, అతని భార్య వెంకటమాధవి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ మహిళకు సంబంధించిన విషయంపైనే వారిద్దరి మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది.

వెంకటమాధవి తలపై మోది హత్య చేసిన తర్వాత మటన్ నరికే కత్తితో ముక్కలుగా నరికాడు. ఆ తర్వాత శరీర భాగాలను బకెట్‌లో వేసి వాటర్ హీటర్‌తో ఉడికించాడు. అనంతరం వాటిని రోకలితో దంచి మూటకట్టి చెరువులో పడేసినట్టు పోలీసులకు చెప్పాడు. అయితే, జిల్లెలగూడ చెరువులో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం.. 15వ తేదీ హత్య చేసిన తర్వాత గురుమూర్తి రెండ్రోజుల పాటు మద్యం సేవిస్తూ ఇంట్లోనే ఉన్నట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు.

వెంకటమాధవి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులకు 17వ తేదీ రాత్రి చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన ఆమె తల్లిదండ్రులు వెంటనే న్యూ వెంకటేశ్వర కాలనీకి వచ్చి సమీపంలో గాలించారు. చుట్టుపక్కల వారిని ఆరా తీశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో గురుమూర్తిని తీసుకెళ్లి.. 18వ తేదీ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు గురుమూర్తి నివాసానికి వచ్చిన తర్వాత సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. 14వ తేదీన వెంకటమాధవి బయటి నుంచి ఇంట్లోకి వెళ్లిన ఫుటేజీ ఉంది కానీ, ఆ తర్వాత బయటకు వెళ్లినట్టు ఆధారాలు దొరకలేదు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన తర్వాత పోలీసులు గురుమూర్తిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా... అసలు విషయం వెలుగు చూసింది. వెంకటమాధవి శరీర భాగాలు లభ్యమైతే వారి పిల్లల డీఎన్ఏతో సరిపోల్చి సాంకేతిక ఆధారాలు సేకరించాలని చూస్తున్నారు. కానీ, గురుమూర్తి చెప్పిన ప్రాంతంలో ఇప్పటి వరకు మృతదేహం ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన వెంకట మాధవి(35)కి అదే గ్రామానికి చెందిన పుట్ట గురుమూర్తి(39)తో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురుమూర్తి ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేసి ప్రస్తుతం డీఆర్‌డీవోలో కాంట్రాక్టు భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వరనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు.


## ఏపీ ప్రజల సెంటిమెంట్‌ను కాపాడేందుకే విశాఖ ఉక్కుకు ప్యాకేజీ

**- కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ**

**విశ్వంభర, భీమవరం:** నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం భారీ ప్యాకేజీ ఇచ్చిందని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటిస్తే అందులో రూ.10,300 కోట్లు క్యాపిటల్ షేర్స్ కింద, రూ.1,140 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించామన్నారు. ప్రైవేటీకరణ నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను మినహాయించి, ఆంధ్రుల సెంటిమెంట్ కాపాడేందుకు కేంద్రం ఈ ప్యాకేజీ ప్రకటించిందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాసవర్మ మాట్లాడారు. ''ఏపీ చరిత్రలో పరిశ్రమను కాపాడేందుకు ఇచ్చిన అతిపెద్ద ప్యాకేజ్ ఇది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించే అవకాశం కలిగినందుకు ఆంధ్రుడిగా గర్విస్తున్నా. దేశంలో స్టీల్ ఉత్పత్తి పెంచాలనేదే ప్రధాని మోదీ లక్ష్యం. ప్రస్తుతం నవంబర్, డిసెంబర్ జీతాలే రూ.230 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అతి త్వరలో స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లిస్తాం. ప్రైవేటీకరణ ప్రకటించాక కూడా వెనక్కు తగ్గి, భారీగా ప్యాకేజీ ప్రకటిస్తే ఇంకా కొందరు దుర్మార్గపు ఆరోపణలు చేస్తున్నారు. భవిష్యత్తులో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరో భారీ ప్యాకేజీ కూడా ఇస్తామని కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటించారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదు. సెయిల్‌లో స్టీల్ ప్లాంట్ విలీనం చేయడం జరగదు. నష్టాల నుంచి బయటకు తీసుకొచ్చాక అప్పగించమని సెయిల్ చెప్పింది. ఈ నెలాఖరులోగా ముడిసరకు తీసుకొచ్చి, ఉత్పత్తి ప్రారంభిస్తాం. ఆగస్ట్ నెలాఖరుకి పూర్తి సామర్థ్యం పెంచి స్టీల్ ప్లాంట్‌ను నష్టాల బాటలోంచి లాభాల్లోకి తీసుకొస్తాం. సొంత గనులు లేకపోయినా వైజాగ్ స్టీల్ లాభాల్లో నడిచిన రోజులు ఉన్నాయి. దేశంలోని జిందాల్, జేఎస్‌డబ్ల్యూ వంటి ప్లాంట్‌లకూ సొంత గనులు లేవు.. అయినా లాభాల్లో ఉన్నాయి. సొంత గనులు ఉంటే నష్టాలు రావనేది వాస్తవం కాదు'' అని శ్రీనివాసవర్మ అన్నారు.

## ఫిబ్రవరి13న ఏపీ పిటిషన్‌పై
# విచారణ



**ఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. కృష్ణా ట్రైబ్యునల్ నీటి పంపకాల విషయంలో ఇవాళ సర్వోన్నత న్యాయస్థానంలో ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేయడంతో.. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది.

కృష్ణా ట్రైబ్యునల్‌కు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య పంపకాలు 2014కు ముందే పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల వ్యవహారాన్ని తేల్చాలని 2023 అక్టోబరులో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకుముందే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. తెలంగాణ భూ భాగంలోనే కృష్ణా నది ఎక్కువగా ప్రవహిస్తోందని.. అందుకని తెలంగాణకు కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాలని ట్రైబ్యునల్‌ను కోరింది. లేదంటే వ్యవహారం తేలే వరకు రెండు రాష్ట్రాలకు 50శాతం చొప్పున నీటి కేటాయింపులు చేయాలని ట్రైబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.

మరోవైపు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే మరోసారి కృష్ణా ట్రైబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఫిబ్రవరి 19 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని తీర్పు ఇవ్వాలని ఏపీ కోరింది. అందుకు అనుగుణంగా స్పందించిన ధర్మాసనం.. ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2 గంటలకు వాదనలు వింటామని తెలిపింది. ఆ మేరకు తెలుగు రాష్ట్రాలు, కేంద్రం సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

### ఎయిర్‌పోర్ట్ కోసం
## స్థల పరిశీలన చేసిన కేంద్ర బృందం

(మొదటి పేజీ తరువాయి)

పాత ఎయిర్ పోర్టు, చుట్టుపక్కల ప్రదేశాలను విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందా లేదా అని స్థల పరిశీలన చేశారు.

సుమారు 1600 ఎకరాలలో నూతనంగా విమానాశ్రయాన్ని నిర్మించడానికి ఆంధ్ర ప్రాంతంలో పలు ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. ఆంధ్ర ప్రాంతం నాగార్జునసాగర్ పరిధిలోని 16 ఎకరాలలో విమానాశ్రయం నిర్మాణం అయితే తెలంగాణ ప్రాంతంలోని పర్యాటక కేంద్రాలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందంలో ఏఎస్ఎన్ మూర్తి, ప్రవీంద్ర తివారి, అరుణ్ కుమార్, అమాన్ చిప్ప, సాజీజ్ అభిలాజ్, ఉస్మాన్ ఉన్నారు. వీరితోపాటు గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తాసిల్దార్ కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ఇరిగేషన్ అగ్రికల్చర్ అధికారుల తదితరులు ఉన్నారు.


## అవినీతిలో అన్ని రికార్డులు దాటేసిన 'ఆప్': జేపీ నడ్డా



**ఢిల్లీ:** పదేళ్ల ఢిల్లీ పాలనలో ఆమ్ ఆద్మీ పార్టీ సర్కారు అవినీతిలో అన్ని రికార్డులు దాటేసిందని భాజపా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దిల్లీలోని ఉత్తమ్‌నగర్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎంతో అమాయకంగా నటిస్తూ అబద్ధాలు చెబుతారని విమర్శించారు. ఈ విషయంలో పోటీ పెడితే ఆయన్ని ఎవరూ అధిగమించలేరని ఎద్దేవా చేశారు.గత పదేళ్లలో దిల్లీలో అభివృద్ధి ఏమైనా జరిగిందంటే.. అది మోదీ వల్లేనని, ఇతరులెవరూ కారణం కాదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు ఆప్‌కి తగిన బుద్ధి చెబుతారని నడ్డా అన్నారు. నూతన మద్యం విధానం పేరుతో ఆప్ ప్రభుత్వం దిల్లీ ప్రజల జేబులకు కన్నం పెట్టిందని విమర్శించారు. రాబోయే ఎన్నికలు దిల్లీ భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని, దానిని దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని సూచించారు. దిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

### రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్
## డైరీ ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ 2025 డైరీని గురువారం ప్రజాభవన్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు ఆవిష్కరించారు. సందర్భంగా రిటైర్డ్ ఇంజనీరింగ్ ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారెడ్డి శ్యాం ప్రసాద్ రెడ్డి, సతీష్‌రెడ్డి పి.ఇంద్రసేనారెడ్డి డాక్టర్ రవీందర్, జి.ఎస్ రెడ్డి, టీ వెంకటేశం, రమణ నాయక్ తదితరులు ఉన్నారు.






## దావోస్‌లో తెలంగాణ ధమాకా..

(మొదటి పేజీ తరువాయి)

16 ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్ లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రూ.1,78,950 కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో 49500 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.

**16 ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు**

1. సన్ పెట్రో కెమికల్స్: భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు. 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు. 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు. రూ. 45,500 కోట్ల పెట్టుబడులు.. 7వేల ఉద్యోగాల కల్పన.
2. అమెజాన్ వెబ్ సర్వీసెస్: ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలో భారీ పెట్టుబడులు. రూ.60,000 కోట్ల భారీ పెట్టుబడి.
3. కంట్రోల్ ఎస్ : తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్. 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్. రూ. 10,000 కోట్ల పెట్టుబడితో 3,600 మందికి ఉపాధి.
4. జేఎస్ డబ్ల్యూ: రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. రూ.800 కోట్ల పెట్టుబడులు, 200 ఉద్యోగాలు.
5. స్కైరూట్ ఏరో స్పేస్: తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు. రూ.500 కోట్ల పెట్టుబడులు
6. మేఘా ఇంజినీరింగ్ మూడు కీలక ఒప్పందాలు: రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్. రూ.15000 కోట్ల పెట్టుబడులు, 5,250 మందికి ఉపాధి.
7. హెచ్‌సీఎల్ టెక్ సెంటర్: హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్. 5వేల మందికి ఉపాధి.
8. విప్రో: హైదరాబాద్‌లో విప్రో కంపెనీ విస్తరణ. గోపన్‌పల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్. 5వేల మందికి ఉద్యోగాలు.
9. ఇన్ఫోసిస్: హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్. రూ.750 కోట్ల పెట్టుబడులు.. 17,000 ఉద్యోగాలు.
10. యూనిలివర్ కంపెనీ: కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్. రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు. దాదాపు వెయ్యి ఉద్యోగాలు.
11. టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్: హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్ ఏర్పాటు. 300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు. రూ.15,000 కోట్ల పెట్టుబడులు
12. ఉర్సా క్లస్టర్స్: అమెరికాకు చెందిన కంపెనీ ఉర్సా క్లస్టర్స్ అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. రూ. 5000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.
13. బ్లాక్‌స్టోన్: ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ హైదరాబాద్‌లో 150 మెగా వాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ₹4,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
14. అక్షత్ గ్రీన్ టెక్ (మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ): అత్యాధునిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రూ.7,000 కోట్ల పెట్టుబడులు.
15. ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్: ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ దాదాపు 800 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయం ఏర్పాటు.
16. సుహానా మసాలా, ఎకో ఫ్యాక్టరీ ఫౌండేషన్: సంగారెడ్డిలో ప్రస్తుతమున్న సుహానా ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది.

## జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం
# 10.71 లక్షల దరఖాస్తులు

**విశ్వంభర, హైదరాబాద్:** జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10.71లక్షల దరఖాస్తులు వచ్చాయని గృహనిర్మాణశాఖ అధికారులు తెలిపారు. గురువారం వరకు 7.50 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని పేర్కొన్నారు. వారం రోజుల్లో మిగతా 3.21లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేస్తామని వెల్లడించారు. సర్వే పూర్తయిన తర్వాతే జీహెచ్‌ఎంసీలో వార్డు సభలు నిర్వహిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,249 మంది సిబ్బంది దరఖాస్తుల పరిశీలనలో పాల్గొంటున్నారని తెలిపారు.

సర్వే సిబ్బంది వివరాలు ఇందిరమ్మ ఇల్లు వెబ్‌సైట్‌లో చూడొచ్చని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు వార్డు సభల్లో కొత్తగా దరఖాస్తులు ఇవ్వొచ్చని అధికారులు సూచించారు. మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కట్టేందుకు సర్కారు నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం.. జీహెచ్‌ఎంసీలోని 24 నియోజకవర్గాలకు 84వేల ఇళ్లు నిర్మించాల్సి ఉంటుంది. ప్రజాపాలన సభల్లో మొత్తం 10.71లక్షల దరఖాస్తులందాయి.